క్లుప్తంగా

దివ్యాంగులకు హాట్ బాక్స్‌ల పంపిణీ

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం కౌన్సిలర్ విజయ్‌కుమార్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పట్టణంలోని స్థానిక దివ్యాంగుల కార్యాలయంలో దివ్యాంగులకు హాట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండల కేంద్రంలో బుధవారం ఉదయం 6 గంటలకు బస్టాండ్ దగ్గర నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండల పరిధి నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో అగస్తలింగాయపల్లె, తురకపల్లె గ్రామాలలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని ఆ గ్రామ సర్పంచ్ ప్రసాద్ తెలిపారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి ఈ పంచాయతీకి జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డును పంచాయతీ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. అవార్డు వచ్చేందుకు సహకరించిన సచివాలయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువకులకు క్రికెట్ కిట్ వితరణ

వీరపునాయునిపల్లి : మండలంలోని ఇందుకూరు గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్ కిట్‌ను మంగళవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వితరణగా అందజేశారు. సోమవారం ఇందుకూరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో యువకులు తమకు క్రికెట్ కిట్ అందించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10వేలు విలువగల క్రికెట్ కిట్‌ను యువకులకు అందజేశారు. యువకులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు చవ్వారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై, చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రేపు వాహనాలకు వేలం

జమ్మలమడుగు : జమ్మలమడుగు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలకు 27వ తేదీన గురువారం వేలం వేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సి.ఐ లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్, ఏదైన ప్రూఫ్ తీసుకుని పాల్గొనాలన్నారు.

వల్లూరు ఎస్‌ఐగా పెద్దఓబన్న

వల్లూరు : స్థానిక ఎస్‌ఐగా పెద్ద ఓబన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప వన్ టౌన్ ఎస్‌ఐగా వున్న ఈయనను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్‌ఐగా వున్న విష్ణువర్ధన్‌ను కడప స్పెషల్ బ్రాంచ్‌లో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ.250 చెల్లించాలన్నారు. ఫలితాల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. దరఖాస్తులు మే 18వ తేదీలోపు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా ప్రాకారోత్సవం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం కలశారాధన, ప్రాకారోత్సవ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న కలశస్థాపన పూజలను ఆలయ అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



నల్లింగాయపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నల్లింగాయపల్లె గ్రామ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని నల్లింగాయలపల్లెలో సర్పంచ్ హైమావతి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులతో ఆ సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందన్నారు.

దాదాపు 80 శాతం ప్రజలు జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని కొనియాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా క్లీన్ స్వీప్ చేయడం ఖాయం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు రాజయకీయ నాయకుడిగా భావించడం లేదని, కేవలం వారి కుటుంబ సభ్యుడిగా భావించడం వల్లనే 51 శాతం ఓట్లతో 151 సీట్లు ఇచ్చారన్నారు. తిరిగి 80 శాతం ఓట్లతో అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. చంద్రబాబు గతంలో వేల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. దళితుల పట్ల ఎప్పటికి చిన్న చూపే చూస్తున్న చంద్రబాబును ఈ సారి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని, ఇక టీడీపీ బంగాళా ఖాతంలో కలవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హైమావతి, ఎంపీటీసీ ప్రియాంక, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, శి వారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, కొండారెడ్డి, పుల్లారెడ్డి, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : నారేపల్లెకు చెందిన రైతులు తమ చెరువుకు నీరు కావాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలసి కోరారు. మంగళవారం పులివెందులలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారేపల్లెకు చెందిన రైతులు తమ చెరువుకు నీళ్లు కాలని కోరడంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో చెరువుకు నీరు విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే జగనన్న దివ్యాంగుల చేయూత పథకంలో భాగంగా మంజూరైన 90 టూవీలర్ స్కూటీలను అందజేయాలని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఎంపీని కోరారు. ఎంపీ స్పందిస్తూ ఇప్పటికే సంబంధిత వాహనాలు సిద్ధంగా ఉన్నాయని త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. అలాగే వికలాంగులకు సహాయ పరికరాలు అందించాలని కోరగా.. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే పట్టణంలోని అహోబిలాపురం రైతులు జగనన్న స్మార్ట్ సిటీలో భూములు కోల్పోయామని.. త్వరగా పరిహారం అందేలా చూడాలని ఎంపీని కోరారు. ఎంపీ స్పందిస్తూ పరిహారానికి సంబంధించిన ఫైలు ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఆమోదం పొందుతోందని.. త్వరలో అందరికి పరిహారం అందుతుందని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే రక్తనిధి, రక్తనిల్వ సిబ్బంది వారి సమస్యలను విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.

ఉచిత దంత పరీక్షలు

చెన్నూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల–ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం దంత మొబైల్ వాహనం ద్వారా దాదాపు 200 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ వెల్‌స్కోప్ అనే పరికరం ద్వారా నోటి క్యాన్సర్ మొదటి దశలోనే గుర్తించవచ్చని తెలిపారు. క్యాన్సర్‌కి సంబంధించి నివారణ చర్యలు చేపట్టి త్వరగా కోలుకోవచ్చన్నారు. అనంతరం మందులు, టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు పంపిణీ చేశారు. ఇతర దంత సమస్యలకు కడపలోని రిమ్స్ దంత వైద్యశాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు నారాయణరెడ్డి, పీజీ డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రమ్యలు పాల్గొన్నారు.

సచివాలయంలోనే 'స్పందన' అర్జీలు ఇవ్వండి

కొండాపురం : మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీలు ఇస్తే అక్కడే పరిష్కారం చేస్తారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా ఆర్డీఓ కార్యాలయం, కడప కలెక్టర్ వద్దకు వెళ్లి స్పందనలో అర్జీలు ఇస్తున్నారని అక్కడికి వెళ్లకుండా గ్రామసచివాలయంలోనే ఇవ్వాలన్నారు.

యూజీడీ పనుల పరిశీలన



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం వార్డు పర్యటనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన రోటరీపురం ప్రాంతంలో పర్యటించి అక్కడ నెలకొన్న రస్తా సమస్యలను టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిష్కరించారు. అలాగే అక్కడ జరుగుతున్న యూజీడీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సత్తెనపల్లి బాబుకు 'తెలంగాణ రత్న' పురస్కారం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సత్తెనపల్లి బాబు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ప్రముఖ రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ సత్తెనపల్లి బాబు హైదరాబాద్‌లో 'తెలంగాణ రత్న' పురస్కారాన్ని అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సోమవారం నిర్వహించిన జాతీయ తెలుగు అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సత్తెనపల్లి బాబు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నాయనపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం

వల్లూరు : పుష్పగిరి క్షేత్రంలో భాగమైన చింతలపత్తూరులోని శ్రీ ఇంద్ర నాథేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

న్యూజెర్సీ వాస్తవ్యులు నంద్యాల హరికృష్ణశర్మ సహాయ సహకారాలతో చింతలపత్తూరుకు చెందిన అవధానం చెంచు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు విభూతి అలంకారాన్ని చేశారు. రుద్ర హోమం అనంతరం మహా పూర్ణాహుతిని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ లబ్ధి



పులివెందుల : స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు



వల్లూరు : కార్యక్రమంలో పాల్గొన్న మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ లబ్ధి చేకూరుతోందని జేసీఎస్ మండల కన్వీనర్ ఎ.భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రబల్లె-2 గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లగొండువారిపల్లె గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాన్ని, అలాగే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన కలమల్ల భాస్కర్ కుటుంబానికి జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి రూ.10వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మా రామమల్లేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కె.సునీల్‌కుమార్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్రామిరెడ్డి, టమోట కాయల బాబు, శశివర్ధన్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, డిష్ వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌పై అపార నమ్మకం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధి పెద్దకొండప్ప కాలనీలో మంగళవారం జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్యామల, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆయన కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి, శ్రీరాముసుబ్బయ్య, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీటీసీ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం 3వ సచివాలయ పరిధిలో ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, ఎంపీటీసీ గంగయ్య, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివ కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కిషోర్ కుమార్, నారాయణరెడ్డి, మురళీరెడ్డి, బాలిరెడ్డి, శశిధర్‌రెడ్డి ఎంపీటీసీ గంగయ్య పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖాధికారి మల్లేశ్వరరెడ్డి

ముద్దనూరు (జమ్మలమడుగు) : వేసవి కాలంలో చీని తోటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని డివిజనల్ ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ముద్దనూరు మండలంలోని ఉప్పలూరు, చిన్నకతేరాపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల్లో చీని తోటలను ఆయన పరిశీలించి రైతులకు సూచనలు అందించారు. చీని తోటల్లో ఎక్కువగా వేరుకుళ్లు తెగులు, బంక తెగులు ఎక్కువగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. చెట్ల మీద ఎక్కువగా బంక తెగులు ఉంటే బోర్డెక్స్ మిశ్రమాన్ని 10 కేజీల సున్నం, 10 కేజీల కాపర్ సల్ఫేట్ తీసుకుని వెయ్యి లీటర్ల నీళ్లలో కలుపుకుని కొమ్మలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే వాడు పట్టిన చీని చెట్లకు కాయలన్నింటిని పీకి వేసి యూరియా 10 గ్రామ్స్ 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



చక్రాయపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆసుపత్రి సూపరింటెండెంట్ సాల్మన్‌రాజ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్యల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని వైద్య సిబ్బంది నిర్వహించి మాట్లాడారు. దోమలవల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధి మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని లక్ష్యమన్నారు. మలేరియా అంటు వ్యాధి కాదని.. ఇది ఆడ దోమ అనాఫిలిస్ కుట్టడంవల్ల వస్తుందన్నారు. మలేరియా జ్వరం ఎక్కువగా వేసవి, వర్షా కాలాలలో వస్తుందన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే రోగి మరణించే అవకాశం ఉందన్నారు. మలేరియా వ్యాధి నివారణకు దోమ తెరలను వాడాలన్నారు. ప్లాస్టిక్ సామాన్లు ఇంటి పరిసరాలకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణవేణి, ఆరోగ్య విస్తరణాధికారి సతీష్‌కుమార్, సూపర్‌వైజర్ జగదీష్, రమణమ్మ, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : దోమ కాటువల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని ఎంపీడీఓ సురేంద్రనాథ్, పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణిలు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగాలలో పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రత గురించి తెలుసుకోవాలని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ రేష్మ తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని తొండూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి భాగ్యమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో మంగళవారం డాక్టర్ స్వాతిసాయి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. జ్వరం వచ్చినప్పుడు వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిజాముద్దీన్, సీహెచ్‌ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మన పరిసరాలు ఎక్కడైతే పరిశుభ్రంగా ఉంటాయో అక్కడి మానవాళి ఆరోగ్యకరంగా ఉంటుందని తహసీల్దారు రాజసింహ నరేంద్ర తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ఆయన మంగళవారం చక్రాయపేటలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బురద నీరు ఉంటే దోమ లార్వాలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంపీడీఓ శివారెడ్డి, వైద్యాధికారులు శ్రీవాణి, స్వర్ణలత, సీహెచ్‌ఓ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ హర్షాద్, పంచాయతీ కార్యదర్శి గంగులయ్య పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : ప్రజలు తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మలేరియా కేసులు నమోదు కాకుండా చూసుకోవాలని వైద్య నిపుణులు చెన్నారెడ్డి, వంశీకృష్ణలు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మంగళవారం వైద్యుల ఆధ్వర్యంలో చెన్నూరులో అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలకేశమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మిదేవి, హెచ్‌ఎస్‌ఎం సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది, ఏఎస్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో ఇటుకల పరిశ్రమ

- పడిపోయిన మట్టి ఇటుక ధరలు
- వేంపల్లె మండల ప్రాంతంలో 70 ఇటుక బట్టీలు
- 10 వేల మంది కూలీలకు ఉపాధి
- చిన్న తరహా పరిశ్రమను ఆదుకోవాలంటున్న యజమానులు



వేంపల్లె ప్రాంతంలో కాల్చిన ఇటుక బట్టీ

వేంపల్లె : మండలంలో మట్టితో తయారు చేసే ఇటుకలకు నాణ్యతాపరంగా మంచి పేరుంది. ఈ ప్రాంత ఇటుక ధృడత్వానికి మారు పేరుగా చెబుతారు. కొద్ది రోజులుగా మట్టి ఇటుక ధరలు అమాంతంగా పడిపోవడంతో ఇటుక పరిశ్రమ నష్టాల ఊబిలో కూరుకపోతోంది. ఇంటి నిర్మాణాలు తగ్గిపోవడంతో తయారు చేసిన ఇటుకను ఏదోక ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది వాటి ధరలు స్థిరంగా కొనసాగుతుండటం నిర్వహణదారులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో మట్టి ఇటుక పరిశ్రమను చిన్న తహర పరిశ్రమగా ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇటుక బట్టీలకు ప్రసిద్ధి..

వేంపల్లె మండల వ్యాప్తంగా మట్టి ఇటుకను తయారు చేసే బట్టీలు 70 వరకు ఉన్నాయి. డిసెంబర్ మొదలు మే వరకు ఇటకలను కూలీలతో తయారు చేయించి కాలుస్తుంటారు. ఏడాదికి సరాసరిన బట్టికి 20 లక్షల వంతున కోట్ల ఇటుకలను తయారు చేసి జిల్లా నలుమూలలకు ఎగుమతులు చేస్తుంటారు. ఇటుక, కోతలు బట్టీల పెచ్చును స్థానికులతోపాటు సుమారు 10వేల మంది వరకు కూలీలకు ఉపాధి దొరుకుతుంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన కూలీలు మట్టి ఇటుకలు తయారు చేయడంలో ప్రావీణ్యులు. దీంతో అక్కడి నుంచి వారికి అధిక మొత్తంలో చెల్లించి పనులకు పిలిపించుకుంటారు. ఈ బట్టీలలో ఇటుకను తయారు చేసే మట్టి నాణ్యమైనది కావడంతో పటిష్టమైన ఇటుక తయారవుతుంది.

పడిపోయిన ఇటుక ధరలు..

కొన్ని నెలలుగా ఇంటి నిర్మాణాలు అంతంత మాత్రం ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణదారులు సిమెంటు ఇటుకపై మొగ్గు చూపడంతో మట్టి ఇటుకలకు గిరాకీ తగ్గింది. గత ఏడాది 1000 ఇటుకలకు ధర రూ.8వేలు ఉండగా.. ఈ ఏడాది 1000 ఇటుకలకు రూ.4వేల నుంచి రూ.4500లు మాత్రమే పలుకుతున్నాయి. గతంలో కన్నా పొట్టు, కట్టెలు, ఎర్ర మట్టి ధరలు బాగా పెరగడంతో వెయ్యి ఇటుకల తయారీకి రూ.5వేల వరకు పెట్టుబడి అవుతోంది. కూలీలకు రూ.500ల నుంచి రూ.600ల వరకు పెంచేశారు. అదనంగా నిల్వ చేయలేక పెట్టిన పెట్టుబడి అయినా వస్తుందని నష్టానికి ఇటుకలను అమ్మాల్సి వస్తోందని యజమానులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ఇటుక బట్టీ పరిశ్రమను చిన్న తరహా పరిశ్రమగా గుర్తించి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించి ఆదుకోవాలని ఇటుకల బట్టీల యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



మట్టి ఇటుక పరిశ్రమలో ఎంతోమంది కూలీలు పనిచేస్తుంటారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పరిశ్రమను కొనసాగిస్తున్నాం. ఈ ఏడాది భవన నిర్మాణ రంగం అంతంత మాత్రంగా ఉండటంతో మట్టి ఇటుకల గిరాకీ తగ్గింది. తయారైన ఇటుకలు బట్టీల్లోనే నిలిచిపోయాయి. కూలీలతోపాటు యజమానులకు జీవనోపాధిగా మారిన ఇటుక పరిశ్రమను ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాలి.

– షేక్ నిస్సార్ బాషా (ఇటుక బట్టీ యజమాని), వేంపల్లె

ఇటుక ధర పడిపోయింది..



ఇంటి నిర్మాణాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఇటుక ధరలు పడిపోయాయి. ఒకప్పుడు 1000 ఇటుకలను రూ.7వేల నుంచి రూ.8 వేలతో అమ్మకాలు జరిపాం. మార్చినెల నుంచి ఇటుక ధర నిలకడగా ఉంది. ప్రస్తుతం ఇటుక తయారీ ధర కంటే తక్కువకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

– పి.రామచంద్ర (ఇటుక బట్టీ యజమాని), వేంపల్లె

ట్రాఫిక్ రూల్స్‌పై దృష్టి పెట్టాలి

వేంపల్లె : పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత డ్రైవింగ్ నేర్చుకునే వారు ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక దృష్టి పెడితే సులువుగా డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చునని పులివెందుల ఎంవీఐ ప్రసాద్ తెలిపారు. పులివెందుల పట్టణంలోని ఆర్టీ కార్యాలయంలో అభయ ఫౌండేషన్, చైతన్యా మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ స్కూలు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎంవీఐ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువతకు అభయ ఫౌండేషన్ వారు ఇచ్చే ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే డ్రైవింగ్ నేర్చుకుంటున్న 16 మంది విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డ్రైవింగ్ మాస్టర్స్ విజయ్‌కుమార్, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో సమయం పాటించాలి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 'స్పందన' కార్యక్రమం నిర్వహించి సమయపాలన పాటించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించి రోజులు ఆన్‌లైన్ నమోదు చేసి మంజూరు చేయాలని ఆయన సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.